ప్రజాశక్తి
శుక్రవారం 1 మార్చి 2024
5
విజయనగరం



జెఎన్‌టియులో ముగిసిన జాతీయ సింపోజియం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులుగా స్థానిక జెఎన్‌టియులో జరిగిన జాతీయ సింపోజియం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగిన సింపోజియం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఎంతో దోహదపడిందని అన్నారు. ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కెరీర్ కు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. థియరీ నాలెడ్జ్‌తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఇటువంటి సింపోజియంకు హాజరు కావడం ద్వారా నైపుణ్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయీభవ



- నేటి నుంచి 73 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
- ప్రథమ సంవత్సరం 20,630 మంది, ద్వితీయ సంవత్సరం 25,134 మంది హాజరు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇంటర్ బోర్డు అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.జిల్లా వ్యాప్తంగా 73 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 17, ఎపి ఆర్‌జెసి 1, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాలు 4, ప్రైవేట్ జూనియర్ కాలేజీలు 47, మోడల్ స్కూళ్ల 4 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 5 తేదీ నుంచి జరిగిన ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు,మరుగుదొడ్లు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా ఆర్టీసి బస్సులు అందుబాటులో ఉంటాయి. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం ప్రథమ సంవత్సరం పరీక్ష జరుగనుంది. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 20,630 మంది పరీక్ష రాయనుండగా, వారిలో బాలురు 9891 మంది, బాలికలు 10739 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 25134 మంది కాగా, వారిలో బాలురు 11872 మంది, బాలికలు 13262 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, అవకతవకలు జరగకుండా నిఘా కెమెరాలు పెట్టారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి, 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు.



బెంచీలపై వేసిన హాల్ టికెట్ నంబర్లు

సెల్ ఫోన్లు అనుమతి లేదు

పరీక్షలు రాసే అభ్యర్థులు, పరీక్షలు నిర్వహించే సిబ్బంది,ఇన్విజిలేటర్‌లు ఎవరూ పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్లు తీసుకు వెళ్లేందుకు అనుమతి లేదు. కాలేజీలో పని చేసే సిబ్బంది కూడా సెల్ ఫోన్లు వినియోగించడానికి అనుమతి లేదు. అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

1200 మందితో పర్యవేక్షణ

పరీక్షల నిర్వహణకు 1200 మంది సిబ్బందిని నియమించారు. వారిలో ఇన్విజిలేటర్‌లు, ఇతర సిబ్బంది ఉన్నారు. మరో వైపు పర్యవేక్షణ కోసం 4 ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 5 సిటింగ్ స్కాడ్ లు ,కలెక్టర్ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ కలిగినా వారు కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి సమస్యను చెప్పుకోవచ్చు. అందుకోసం 08922.237988, 7989728842 నెంబర్లను సంప్రదించవచ్చు.

ఎస్.కోటపై బొత్స గురి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఎస్.కోట నియోజకవర్గంపై జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక గురిపెట్టినట్టుగా తెలుస్తోంది. విశాఖ ఎంపీగా ఆయన సతీమణి, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి రంగంలోకి దిగుతున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో ఆ పార్లమెంట్ పరిధిలోవున్న ఎస్.కోట రాజకీయాలపై మంత్రి వ్యూహానికి పదును పెట్టినట్టుగా సమాచారం. వైసిపిలోని అసమ్మతి గ్రూపు టిడిపిలోకి జంప్ జిలానికీ రంగం సిద్ధమైన నేపథ్యంలో, అదే టిడిపి నుంచి కీలకనేతతో టచ్‌లోవున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. పార్టీలో అనుకున్న ప్రకారం జరక్కపోతే వైసిపిలోకి వచ్చేయాలని, భవిష్యత్తులో సముచిత స్థానం వచ్చేలా తాను చూసుకుంటానని, అలా వచ్చేందుకు ఇబ్బంది అయితే పరోక్షంగానైనా సహకరించాలని కోరినట్టు సమాచారం. సదరు టిడిపి నేత అధిష్టానం వైఖరిని బట్టి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టుగా బోగట్టా. టిడిపిలోనూ రెండు గ్రూపులు ఉన్న నేపథ్యంలో బొత్స వ్యూహానికి ప్రాధాన్యత సంతరించుకుంది. టిడిపి అధిష్టానం కూడా అభ్యర్థులను భేరీజు వేయడంతోపాటు బొత్స ప్రభావాన్ని కూడా అంచనా వేస్తోందని, అందుకే అభ్యర్థుల ప్రకటనలో జాప్యం జరుగుతోందని కూడా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోవైపు టిడిపి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు అభ్యర్థులను

టిడిపిలో గ్రూపులను ఉపయోగించుకునేందుకు వ్యూహం

కేటాయించిన విషయం విధితమే. ఎస్.కోట, చీపురుపల్లి అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. చీపురుపల్లి వరకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కోసం అధిష్టానం ఖాళీగా ఉంచింది. ఎస్.కోటలో ఇద్దరు నేతలు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రయత్నిస్తున్నారు. మొత్తానికి టిక్కెట్ ఎవరికి ఇస్తారనేదాన్ని బట్టి బొత్స వ్యూహం ఉంటుందని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈనేపథ్యంలో అందరి దృష్టినీ ఎస్.కోట రాజకీయాలు ఆకర్షిస్తున్నాయి.

3న పల్స్‌పోలియో

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం సందర్భంగా ఈనెల 3న ఆదివారం జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేస్తామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఒ కె.రాణి, జిల్లా టీకా నియంత్రణ అధికారి ఆర్.అచ్యుతకుమారి, డిడిఎంహెచ్‌ఒ ఎస్.సూర్య నారాయణ, డెమో వి.చిన్నతల్లి, జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.గురువారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాములకు వేసిన సీళ్లను, సిసి కెమేరాల ద్వారా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాములవద్ద భద్రతను పటిష్టం చేయాలని, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్‌ఓ ఎస్‌డి అనిత, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, డిప్యూటీ తాహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టి పెట్టండి

ఓటర్ల ప్రలోభాలను అరికట్టాలి • విజిలెన్స్, ఇఎస్ఎంఎస్ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపరిచే చర్యలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పెద్ద ఎత్తున జరిగే నగదు బదిలీ, వివిధ రకాల వస్తువులు, వస్త్రాల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్, ఇఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) నోడల్ ఆఫీసర్ల సమావేశాన్ని కలెక్టర్ తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించారు. ముందుగా ఆయా నోడల్ అధికారుల విధులను, శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో అన్ని రకాల ప్రలోభాలను అరికట్టాలని ఆదేశించారు. నగదు, మద్యం, వివిధ రకాల పరికరాలు, వస్తువులు, వస్త్రాలు, ఆభరణాల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చేవరకు ఆగకుండా ఇప్పటినుంచే ఆయా శాఖలు దృష్టి సారించాలని సూచించారు. వినూత్న పద్ధతుల్లో అక్రమంగా రవాణా చేసే అవకాశం ఉందని, వాటిని కూడా ముందుగానే పసిగట్టి నియంత్రించాలని అన్నారు. బ్యాంకుల్లో రూ.2లక్షల దాటిన నగదు లావాదేవీలపై ఖాతాదారులు వివరాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఎటిఎంలకు, బ్యాంకులకు నగదును తరలించే టప్పుడు, ఆ నగదుకు ప్రత్యేక క్యుఆర్ కోడ్‌ను కేటాయించే కొత్త విధానం త్వరలో అందుబాటులోకి వస్తుందని



విజిలెన్స్, ఇఎస్ఎంఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

చెప్పారు. ఓటర్లను ప్రలోభపెట్టే అన్ని రకాల చర్యలను పూర్తిగా నిరోధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సుమారు రూ.777 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువులను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే రాజస్తాన్ ఎన్నికల్లో సుమారు రూ.700 కోట్లు, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో రూ.300 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువులను సీజ్ చేశారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ, కట్టుదిట్టంగా మద్యం, వస్తువుల అక్రమ రవాణా, నగదు బదిలీలను పూర్తిగా నిరోధించాలని కలెక్టర్ కోరారు.

సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, నోడల్ ఆఫీసర్లు ఎఎస్‌పి అస్మా పర్వీన్, ఆదాయ పన్నుల శాఖ అధికారి ఎన్.రేణుకాదేవి, ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్‌డివిజి రాజు, సిజిఎస్‌టి సూపరింటెండెంట్ ఎఎస్‌ఎల్ శర్మ, ఎస్‌జిఎస్‌టి సూపరింటెండెంట్ పిబి వల్లి, ఎఫ్‌ఆర్‌ఒ బి.అప్పలరాజు, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్ కుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



దీక్ష చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

- ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ మట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కరించడంలోను, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలోను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కార్మికుల చెస్ ద్వారా బోర్డులో ఉన్న రూ.2000 కోట్లను ఇతర అవసరాలకు దారి మళ్లించి సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. జీవో 12,13ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డును సమర్థ వంతంగా నిర్వహించాలని, ఉపాధికి నష్టం చేసే మెమో 12,13 లను రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సంఘం అధ్యక్షులు కంది త్రినాధరావు, రాజు, బి.గోపాల్, జనార్ధన్, పైడినాయుడు, కార్మికులకు మద్దతుగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిలో

గిరిజన వైద్యానికి ప్రత్యేక విభాగం

- విద్యార్థుల వరుస మరణాలపై అధ్యయనానికి సిఫారసు
- ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు
- సాలూరు రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్యం కోసం గిరిజనులు చేరిన వెంటనే వారికి మెరుగైన సత్వర సేవలు అందించేందుకు వీలుగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి సూచిస్తానని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు చెప్పారు. ఈ సెల్ ఏర్పాటు ద్వారా ప్రత్యేక వైద్య(రెఫరల్) సేవలు పొందేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే గిరిజనులకు సత్వర వైద్యసేవలు అందడంతో పాటు వారికి అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించే అవకాశం వుంటుందన్నారు. విశాఖపట్నంలోనూ, పార్వతీపురం ఆసుపత్రిలోనూ ఇటువంటి సెల్‌లు ఏర్పాటు చేశారని, వీటివల్ల మంచి ఫలితాలు వుంటున్నాయని చెప్పారు. సాలూరు మండలం విజయరాంపురం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి వ్యాన్ బోల్తాపడిన ఘటనలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మంది గిరిజనులను ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న గిరిజనుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సహాయం గురించి తెలుసుకోవడంతోపాటు అక్కడి వైద్యులతో మాట్లాడి ప్రమాద అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని కోరారు.. బాధితులకు మరింత వైద్యసేవలు అందించేలా ఐటిడిఎ, ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు.

అనంతరం ఎస్‌టి కమిషన్ ఛైర్మన్



క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఛైర్మన్ డివిజి శంకరరావు

మీడియాతో మాట్లాడుతూ పలు జిల్లాల్లో గిరిజన విద్యార్థుల మరణాలు ఇటీవలి కాలంలో వరుసగా సంభవిస్తున్నాయని, తాను కూడా పలు ప్రాంతాలను సందర్శించానని చెప్పారు. అయితే ఈ మరణాలన్నీ ఒకే కారణంతో జరగడం లేదని, వేర్వేరు కారణాలతో సంభవిస్తున్నట్టు తెలుస్తోందని చెప్పారు. గిరిజన విద్యార్థుల మరణాలకు కారణాలను తెలుసుకొని వాటిని భవిష్యత్తులో పునరావృతం కాకుండా నివారించేందుకు వైద్య నిపుణులు, విద్యా రంగ నిపుణులతో కమిటీ వేసి సమగ్ర అధ్యయనం జరిపించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలిక ఫలితాలు వుంటాయన్నారు. ఈ పర్యటనలో ఆర్ఎంఒ డాక్టర్ సురేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన వసతి గృహాలకు మెస్ బిల్లులు బిల్లులను విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఆరు నెలలుగా బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. దీంతో వసతి గృహాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వసతి గృహాలకు డైట్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజల బాగు కోసమే సచివాలయ వ్యవస్థ

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ • సచివాలయాలు, ఆర్‌బికెలు ప్రారంభం

ప్రజాశక్తి-గుర్ల

ప్రజల బాగోగులు చూడటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి గ్రామంలోనే పదిమంది సచివాలయ కార్యదర్శులను అందుబాటులో ఉంచారని చెప్పారు. గుర్ల మండలం చింతపల్లి పేట, పాలవలసలో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతపల్లి పేట లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు వివిధ రకాల సేవలను అందించడానికి సుమారు 25 మంది ప్రభుత్వ సిబ్బంది, వాలంటీర్లు అందుబాటులో ఉంచారని చెప్పారు. రైతు సంక్షేమం కోసం, వ్యవసాయాన్ని సుభిక్షం చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మంచి జరిగి ఉంటేనే తమకు అండగా నిలబడాలని కోరారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామాల స్వరూపాలు మారిపోయాయని అన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం అందుబాటులో ఉందన్నారు. ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ, ఒక్క



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బొత్స, జెడ్‌పి ఛైర్మన్, కలెక్టర్

చింతపల్లి పేట గ్రామానికే వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు రూ.14 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతి, ఎంపిపి ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ వెంకటరమణ, పార్టీ నాయకులు కేవి సూర్యనారాయణ రాజు, జమ్ము స్వామినాయుడు, బంగారునాయుడు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మాజీ కౌన్సిలర్ వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాము చేస్తున్న అభివృద్ధి వల్ల తమ పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గురువారం బొబ్బాది పేటలో మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాధరావు, బొబ్బాది విజయలక్ష్మి, కర్రోతు అప్పారావు, సీతం నాయుడు తదితరులు కోలగట్ల సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసిన కోలగట్ల వీరభద్రస్వామి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కషి చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోలగట్ల సూచించారు. కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్ , స్థానిక కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు నారాయణ అప్పుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

బిటి రహదారి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 39వ డివిజన్ అలకానంద కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బిటి రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. అనంతరం జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేనంత అభివద్ధి సుందరీకరణ పనులు ఆశించిన దానికన్నా ఎక్కువగా జరిగాయన్నారు. చేసిన అభివృద్ధిని అభినందించాల్సింది పోయి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇంచార్జ్ కోలగట్ల తమన్న శెట్టి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కార్పొరేటర్ పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఓట్ ఫర్ ఒపిఎస్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ అమలు చేసే వారికే ఓటు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేసిన వారికే ఓటు వేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. ఓట్ ఫర్ ఒపిఎస్ ప్రచార పత్రాలను గురువారం ఆమె విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఒపిఎస్ అమలు చేస్తామని ఎన్నికల్లో వైసిపి హామీ ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఒపిఎస్ అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకు ఓటు వేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, సత్యనారాయణ, కె.కృష్ణదాసు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పరిమళించిన మానవత్వం

ప్రజాశక్తి-బొబ్బిలి

పశ్చిమబెంగాల్ నుంచి బతుకు దెరువు కోసం బొబ్బిలి వచ్చి వచ్చిన వృద్ధురాలు పుల్కోదేవి.. నెమలి పింఛాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. స్థానిక నోబుల్ పాఠశాల ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనంలో తలదాచుకుంటోంది. బుధవారం రైల్వేస్టేషన్ జంక్షన్లో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురైంది. అక్కడే ఉన్న కింతలవానిపేటకు చెందిన కిశోర్ అనే యువకుడు మరికొందరి సహాయంతో బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రికి ఆమెను తరలించారు. వైద్యులు స్పందించి ఎడమ కాలికి 7 కుట్లు, గెడ్డంపై రెండు కుట్లు వేశారు. పై దవడలో 3 పళ్లు ఊడి పోయాయి. వైద్యులు చికిత్స అందించి పంపించి వేశారు. ఈ విషయాన్ని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు దృష్టికి కిశోర్ తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన జెసి రాజు గురువారం ఆమెను పరామర్శించారు. పోషణకు, వైద్య ఖర్చులకు కొంత మొత్తాన్ని ఆమెకు అందించారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక ఎన్ఆర్ఐ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్య సహాయం అందిస్తామని ఆమెకు భరోసా కల్పించారు.

నేటి నుంచి ఆర్‌టిసి డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్‌టిసి డిపోలో మార్చి 1 నుంచి అద్దె బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణతో పాటు ప్రయాణికుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సిఐ బి.ఆదినారాయణ తెలిపారు. గురువారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ అద్దె బస్సుడ్రైవర్లపై ఇటీవల కాలంలో అనేక ఫిర్యాదులు రావడంతో ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం డిపోలో మొత్తం 51 అద్దె బస్సులు ఉన్నాయని, ఒక్కొక్క బస్సు కు ఇద్దరు డ్రైవర్లు చొప్పున 102మంది డ్రైవర్లు, ఓనర్లు 25 నుంచి 30మంది ఉన్నారని తెలిపారు. రోజుకు ఐదుగురు డ్రైవర్లు, వారికి సంబంధించిన ఓనర్లను సమావేశ పరచి బస్సులు నడుపు సమయంలో వారు చేస్తున్న పొరపాట్లను తెలియజేస్తామని తెలిపారు.

పొదుపు సంఘాల పనితీరుపై పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

స్థానిక వైకెపి కార్యాలయంలో గురువారం కొటారుబిల్లికి చెందిన ధనలక్ష్మి పొదుపు సంఘం పనితీరును ప్రభుత్వం నియమించిన ఎపి మాస్ టీం పరిశీలించింది. కార్యవర్గ సభ్యులు ఏ విధంగా పనిచేస్తున్నారు, వారు విధులు, బాధ్యతలు ఏమిటి, మహాజనసభ ఎలా నిర్వహిస్తున్నారు, తదితర అంశాలను పరిశీలించారు. మండలానికి అవార్డు రావడంపై రాష్ట్ర బృందం సంతోషం వ్యక్తంచేసింది. కార్యక్రమంలో డిజిఎం శ్రీనివాస్, ఎపిడి సావిత్రి, ఎజిఎం ఉమామహేశ్వర రావు, డిపిఎంలు జయశ్రీ, బంగారమ్మ, ఎసి ఆదయ్య, ఎపిఎం శ్రీనివాస్ దేవకుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వనిత క్లబ్ ఆధ్వర్యాన పట్టణంలో పేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సమాజంలోని వివిధ వర్గాల వారికి సేవ చేయడమే తమ లక్ష్యమని వనిత క్లబ్ అధ్యక్షులు కందుకూరి కళ్యాణి అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆదిమూలం రత్నావతి, రీజనల్ చైర్మన్ బాలనాగు శ్రీనివాస్, రీజనల్ సెక్రటరీ హరీష్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ కొల్లా పుష్పారాణి, తదితరులు పాల్గొన్నారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సహారా బాధితులకు న్యాయం చేయాలని ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు బి.లక్ష్మిదాసు ఒక ప్రకటనలో కోరారు. సహారా యాజమాన్యం అధిక వడ్డీలను ఎరచూపి ప్రజల నుంచి డిపాజిట్ రూపంలో డబ్బులు వసూలు చేసి మోసం చేయడంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సహారా ఎమ్‌డి సుబ్రతారాయ్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టిందని చెప్పారు. తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం యాజమాన్యానికి కొమ్ముకాసి బాధితులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సహారా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కొత్తవలస

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్షల్లో ఎం.హేమ వర్షిణి (మోడల్ స్కూల్), సిహెచ్.మోహన్‌రావు (ఒపి జిందాల్ స్కూల్), కె.నవ భారత్ (సెయింట్ ఆన్స్ స్కూల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు గురువారం సిఐ వి.చంద్ర శేఖర్, ఎస్ఐ సుదర్శన్ బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ ఉపాధ్యక్షులు ఎం.హర్ష, సహాయ కార్యదర్శి రమేష్, సభ్యులు గణేష్ పాల్గొన్నారు.

ఎఒ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఎఒ యు.రామలింగేశ్వర రావు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ రామలింగేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వరరావు వృత్తిలో నిమగ్నమై ఎన్నో రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైస్ ఎంపిపి బి.రమేష్, టెంటు మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -విజయనగరం కోట

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు , కెఆర్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి. కాంతారావు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు ప్లాంక్, పెన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించామన్నారు. ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముడ్డద మధు, వైసిపి విద్యార్థి విభాగం నాయకులు జానకిరామ్ మాట్లాడారు.అనంతరం కాంతారావును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయంలో ప్రాణ ప్రతిష్ట

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని రింగ్ రోడ్డులో గల షిరిడి సాయి ఆలయంలో గుఉవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని ఉమా రామలింగేశ్వర స్వామి శివలింగ పున్న ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, షిరిడి సాయి సేవా సమాజం అధ్యక్షులు కరణం జనార్ధనరావు దంపతులు హోమం నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 5వ , 7వ డివిజన్ లకు చెందిన గువ్వల ప్రసాద్, కోండ్రు శంకరరావు, చిప్పాడ శ్రీను, నామాల ఎల్లాజీ, కనకల గోవింద్, దువ్వ శేఖర్, ఒమ్మి లక్ష్మణరావుతో పాటు 35 కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి విజయలక్ష్మి వారందరికీ పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, అవనాపు విజయ్, పిళ్లా విజయ్‌కుమార్, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్లు ఒప్పందం చేయాలని ధర్నా

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ బెవరిజెస్ హమాలీ కార్మికులకు కూలి రేట్లుపెంచాలని, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యూనిఫారం బట్టలు ఇవ్వాలని, గురువారం ఏపీ బెవరెజేస్ నెల్లిమర్ల డిపో ఎదుట హమాలీలు ధర్నా చేశారు. ఈ దర్నాలో ఇన్స్యూరెన్స్ అమలు చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగి రాకపోతే కచ్చితంగా సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, డిపో కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

ఎమ్మెల్యే అప్పలనర్సయ్య



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే బొత్స. అప్పల నరసయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 45.90 ఎకరాలలో నాలుగు కోట్ల 39 లక్షలు ఖర్చుతో 34 లేఔట్ లు వేసి 1391 మంది లబ్ధిదారులకు పార్టీలకు అతీతంగా ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. 994 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి వారికి హక్కు పత్రాలను కూడా అందిస్తున్నామని అన్నారు. ఇంటింటికీ కుళాయిలు, సిసి రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించామన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివద్ధి చేయాలని పరిపాలన రాజధానిగా విశాఖను ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. ప్రతిపక్ష టిడిపి గత 14ఏళ్లలో ఏనాడూ ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. తాజాగా ఎన్నికల కోసం సూపర్ సిక్స్ అంటూ దొంగ హామీలతో ప్రజలను మోసం చేయడానికి గంపగుత్తగా వస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, ఎంపిపి బెల్లాన.జ్ఞానదీపిక, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాధ రావు, మండల సురేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

బొండపల్లి : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. అందులో భాగంగా రీసర్వే చేసి, పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం బొండపల్లిలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పక్కా పట్టాలు తీసుకున్న వారికి ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పిస్తూ అమ్ముకోవడానికి అధికారం కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, మాజీ ఎంపిపి బి.బంగారం, మీసాల తులసి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి రఘు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ధర్నా




ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు బుకారిబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ బుకారిబాబు మాట్లాడుతూ ఉద్యోగులు పొందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో మంజూరు చేయడం లేదు సరి కదా విడుదల చేయడంలోను ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని అన్నారు. 12వ పి.ఆర్.సిలో మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పి.ఆర్.సి బకాయిలు విడతల వారీగా కాకుండా ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డిఎలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. టీచర్ల నియామకంలో మళ్లీ ప్రవేశపెట్టిన అప్రెంటిస్ విధానం రద్దుచేసి రెగ్యులర్ స్కేలులో వారిని నియమించాలని డిమాండ్ చేశారు.ధర్నా లో సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనుదారుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని పాత తాలూకా కేంద్రం బొబ్బిలిలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. వీరికి పింఛనుదారులు, ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. పింఛనుదారుల సంఘం రాష్ట్ర నాయకులు రౌతు రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగుల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జె సి రాజు, జిల్లా నాయకులు జోగినాయుడు, పీటర్, మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఎల్లయ్య, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని పోతంపేట పంచాయతీలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ నూతన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు , వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) , సర్పంచ్ కొట్యాడ దేవి మహేష్, వైసిపి సీనియర్ నాయకులు భోకం అప్పారావు, గొర్లె అప్పారావు, కృష్ణ, తాతబాబు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక కెజిబివి పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలకు వెళ్ళేటప్పుడు భయం, ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలో ప్రశ్నపత్రాన్ని నిశితంగా పరిశీలించి జవాబు వెంటనే రాయాలని, రాని జవాబు కోసం ఎదురు చూసి సమయాన్ని వృధా చేయవద్దని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మనో ధైర్యాన్ని నింపి పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత ధ్యేయంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్స్‌పాల్ బి.ఉమ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహ సంస్థ వార్షికోత్సవం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు ఎఎస్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు.. డాక్టర్ ఎ.ధరణి వేపాడ, ఉపాధ్యాయులు ఎన్.అప్పయ్యమ్మ, డిగ్రీ కళాశాల లెక్చరర్ బి.లక్ష్మి, సిహెచ్ఒ బి.రాధారాణి, యోగా ఇన్‌స్ట్రక్టర్ జి రుచిత, కరాటే క్రీడాకారిణి షేక్ తానీషాని సన్మానించారు. సోంపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల యోగా ఆకట్టుకుంది. షేక్ తానీషా కరాటే ప్రదర్శన చేశారు. తానీషాకు సంస్థ సభ్యులు ఎం.భాస్కరరావు రూ.5116 అందించారు. స్నేహ ప్రతిభ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు పాల్గొన్నారు.

లెండిలో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. మూడు రోజులు పాటు జరిగే ఈ వర్క్‌షాపు ద్వారా యువతలో ఉండే లక్ష్యం, ఉత్సుకత, సృజనాత్మకత, ఊహాశక్తిని పెంపొందిచనున్నారు. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి జెఎన్‌టియు జివి, లెండి ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ సాంకేతిక విద్యలో అభ్యసనకు, దాని ఫలితాలకు చేయూతనిచ్చేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సెషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవ కుమార్ పాఠశాల విద్యాశాఖతో దాని సహకారంపై మాట్లాడారు. టి. సుదర్శన్, యునిసేఫ్ కన్సల్టెంట్ అటల్‌మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వివి రామారెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా సైన్స్ అధికారి ఎం. కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ కెవి నరసింహం, అన్ని హెచ్ఒడిలు డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ శైలజ, డాక్టర్ సతీష్, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ రామారావు, డాక్టర్ ప్రసాద్,రాజేందర్ పాల్గొన్నారు.


ఘనంగా రాజబంగారమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేట గ్రామదేవత రాజ బంగారమ్మ ఆలయ పున్న ప్రతిష్ట గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవనాపు విక్రమ్ మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని పున్నరుద్దరించి, అందంగా తీర్చిదిద్దిన ఆలయ కమిటీ సభ్యులు అభినందనీయులన్నారు. ఈసందర్భంగా అవనాపు విక్రమ్ రూ.20వేలు విరాళంగా అందించారు. కార్యక్రమం లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, వైసిపి నాయకులు అవనాపు విజయ భాస్కరరావు, సముద్రపు వెంకట రమణ, సత్తిబాబు, మద్దిల రాజు, మద్దిల రాజారావు, మద్దిల దుర్గారావు, కాళ్ళ రాజశేఖర్, స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

అదానీ పవర్ ప్లాంట్‌ను అడ్డుకుంటాం


నిరసన తెలుపుతున్న గిరిజనులు



ప్రజాశక్తి-వేపాడ

మారిక గ్రామంలో ఆదానీ గ్రీన్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని అడ్డుకుంటామని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ హెచ్చరించారు. బుధ, గురువారాల్లో మారిక గ్రామంలో ఆయన పర్యటించి, గిరిజనులతో మాట్లాడారు. రైవాడ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ స్టోరేజ్ వద్ద శారద నదిపై అడ్డుకట్ట వేసి లిఫ్ట్ ద్వారా మారిక గడ్డ మీదుగా కొండపైన ఉన్న మారికలో నీటిని నిల్వచేసి, దీంతో మారికలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మించాలని చూస్తున్నారని తెలిపారు. దీంతో పచ్చటి కొండలలో అదానీ ప్రవేశంతో మారిక రోడ్డుపై తిరగకుండానే ఆ గ్రామాలు అదానీ పరమవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. రైవాడ రిజర్వాయర్ ఆధారంగా పంటలు సాగుచేస్తన్న రైతులకు ఇకపై నీరుండదని చెప్పారు. మారిక గెడ్డ ఆధారంగా వీలుపర్తి తూము చెరువుకు నీరు రాదని తెలిపారు. ఇలా గిరిజనులను, రైతులను నట్టేట ముంచే అదానీ గ్రీన్ హైడ్రో పవర్ ప్లాంట్‌ను గిరిజనులు, రైతులను ఐక్యం చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. పోరాటం ఉధృతం కాకముందే పవర్ ప్లాంట్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిల్లో ఆనంద్, గెమ్మెల రామకృష్ణ, బాబూరావు, అప్పలనాయుడు, వెంకటరావు, ఆశ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక రైతు : జెడి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి విటి రామారావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతు దేశానికి వెన్నెముక వంటివాడని ఆ రైతు సమృద్ధి సాధించిన నాడు దేశం అభివృద్ధి పథంలో ముందంజలో ఉంటుందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రైతు సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు మేలు రకాలైన వంగడాలతో పంటలు పండించి రసాయనాల వాడకం తగ్గించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యవసాయ అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. అగ్రికల్చర్ బిఎస్‌సి చదివే విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా అవసరమైతే స్వయం ఉపాధి కింద తీసుకోవాల న్నారు. బ్రెడ్స్ ఎన్‌జిఒ సిఇఒ ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ సెంచూరియన్ సహకారంతో వ్యవసాయ ఉత్పత్తుల సంఘాలను (ఎఫ్.పి.ఒలు) బలోపేతం చేస్తామన్నారు. స్మార్ట్ అగ్రికల్చర్ స్కూల్ వల్ల జిల్లాకు విశేష ప్రయోజనాలు ఉన్నాయన్నారు. యాజమాన్య ప్రతినిధి ఎస్.రవీంద్ర మాట్లాడుతూ సెంచూరియన్ వ్యవసాయ రంగానికి విశేష కృషి చేస్తోందన్నారు. రైతులకు సాంకేతిక మెలకువలు తెలియజేసేందుకు సెంచూరియన్ అందుబాటులో ఉంటుందని ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అగ్రికల్చర్ స్కూల్ డీన్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన మెలకువలను అందించడంతోపాటు వారు సమృద్ధి సాధించడానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మధుసూదనరావు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అసిస్టెంట్ డైరెక్టర్ మహరాజన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

భూపట్టాలు ఇవ్వాలని 4 నుంచి దీక్షలు

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజనుల సాగుభూములకు పట్టాలు ఇవ్వాలని ఈ నెల నాలుగో తేది నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సిపిఎం నాయకులు రాకోటి రాములు, తామరాపల్లి సోములు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలో 1500 కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా అటవీ భూములు, డిపట్టా, గెడ్డ, కొండ పోరంబోకు, ప్రభుత్వ భూములను సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సాగుచేస్తున్న గిరిజన, దళిత, నిరుపేదలకు సమగ్ర సర్వే నిర్వహించి అర్హత ఉన్న వారికి భూపట్టాలు ఇవ్వాలని కోరితే, సుమారుగా 500 మందికి సర్వే చేశారని గుర్తుచేశారు. మిగతా వెయ్యి మందికి సర్వే చేపట్టకపోవడంతో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు తమగోడు విన్నవించుకుందామని వెళ్లిన గిరిజనులను తిరస్కరించడం అమానుష మని ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజన మంత్రి అయి ఉండి గిరిజనులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గిరిజనుల సాగు భూముల విషయంలో పూర్తి స్థాయిలో సర్వే చేసి భూపట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 4వ తేది నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తప్పవు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతులు, ఎన్ఒసిలు లేకుండా పశువులును అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ సూ ర్యకళ హెచ్చరించారు. గురువారం తన ఛాంబర్‌లో జంతుసంక్షేమ కమిటీ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టడానికి మండలస్థాయిలో యస్‌హెచ్ఒ, తహశీల్దార్, ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఉన్న కమిటీలను పటిష్టపరచి పర్యవేక్షణ చేస్తామన్నారు. జంతు సంక్షేమ కమిటీలు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ పశువుల సంతల్లో కనీస మౌళిక సదుపాయాలు సి.సి కెమెరాలు లేకుండానే సంతకు లైసెన్స్ లు ఇస్తున్న అధికారులు పై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విజయనగరం పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.వి రమణ, రూరల్ సిఐ ఎం.శ్రీనివాసరావు, విద్యాశాఖ తరుపున జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ యస్. సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్..మొండి వైఖరి విడనాడాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి విడనాడి ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ హెచ్చరించారు. స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం డిఎ బకాయిలు చెల్లించాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి జిల్లా కార్మికులు, ప్రజల మద్దతు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఉద్యోగులు మిరప నారాయణ, కాము నాయుడు, నాగభూషణం, అప్పలనాయుడు, మధు, మూర్తి, రాంబాబు, బంగారు నాయుడు, గౌరీ, వరలక్ష్మి, రామకృష్ణ, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఉన్నత పాఠశాలలో 8,9 వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి-2 బి.పాపినాయుడు అన్నారు. గురువారం తిప్పలవలస ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. డిజిటల్ విద్యలో భాగంగా ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను విద్యార్థులు ఎంత వరకు సద్వినియోగం చేసుకుంటున్నారో పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధాయులకు వీటి వివియోగంపై తగు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించే పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. బోజనాల నాణ్యత, మెను ఎలా ఉందని విద్యార్థుల వద్ద ఆరా తీశారు. వండిన ఆహార పధార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వీటితో పాటు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీఅవర్స్‌ను పరిశీలించారు. ప్రతిఒక్కరూ కష్టపడి చదవాలని, మంచి మార్కులు సంపాదించి ఉన్నత చదువులకు వెళ్లాలని ఆయన సూచించారు.పరిశీలనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

90 మద్యం బాటిళ్లు పట్టివేత

నెల్లిమర్ల : 90 అక్రమ మద్యం బాటిళ్లను ఎస్ఇబి ఎస్ఐ బి. లలిత బుధవారం రాత్రి స్థానిక మొయిద జంక్షన్ వద్ద పట్టుకున్నారు. మద్యంతో పట్టుబడిన వ్యక్తి వద్ద 83 చిన్న మద్యం బాటిళ్ళు, 7 కింగ్ ఫిషర్ బీరు బాటిల్స్ ఉన్నాయని ఆమె తెలిపారు. పట్టుకున్న వ్యక్తిని స్థానిక పోలీసు స్టేషన్‌కి తరలించామన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

కొత్తవలస : మండలంలోని రామలింగాపురం, చిన్నమన్ని పాలెం గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు చేశారు. 1800 లీటర్ల ఓటను ధ్వంసం చేసినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇకపై సారా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

రామభద్రపురం : చందాపురం శివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. చట్ట విరుద్ధమైన పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.